# సింగిల్ పేజి కథలు

## బాధ్యత

రామారావుగారికి తన గొంతు తనే నులుముకోవాలన్పిస్తోంది. ఏ కొండమీదకైనా ఎక్కి దూకాలన్పిస్తోంది. చేసిన పాపం ప్రాణం పోసుకుని కళ్ళముందు తిరుగుతూ ఉంటే "వెళ్ళి రైలు కింద పడదాము" అనే భావం క్షణ క్షణానికీ పెరిగిపోతోంది. అదిగో ఆ సంగతి తెలిసినప్పటినుంచీ, కానీ ఇది తన మరణంతో సమసిపోయే సమస్య కాదు. తను కూడా లేకుంటే ఇంకా పెద్ద దయ్యే కష్టం. 'పోనీ, నాతోపాటు దాన్నీ చంపేస్తే?'

'పాపం..అన్నెం పున్నెం ఎరుగని పిల్ల..తల్లి లేనిదని, నా చేతుల్తో ఎంతో గారాబంగా పెంచాను. అయినా ఒక్కనాడూ చిన్న పొరపాటు కూడా చేసి ఎరుగదు. చక్కగా చదువుకున్నది. సంగీత, సాహిత్యాల్లోనూ ప్రావీణ్యం సాధించింది. అన్నీ తెలిసిన అణుకువ గలది. ఉద్యోగం చేద్దామని కూడా ఉబలాటపడింది. కానీ, నేనే పెద్ద మూర్ఖుణ్ణి కదా..వద్దన్నాను. ఊరుకున్నది. పెళ్ళిరూపంలో ప్రమాదం ముంచుకొచ్చింది.'

ప్రమాదం..ప్రమాదం..ప్రమాదం...

ఆయన మనసు గతాన్ని శోధిస్తూ సాగిపోయింది.

* * *

రామారావుగారమ్మాయి వందనకు ఆరోజు పెళ్ళి చూపులు. అబ్బాయి తరపున ఐదుగురు వచ్చారు. రామ్మూర్తిగారు తన ఇద్దరు తమ్ముళ్ళనూ, మరదళ్ళనూ సాయానికి పిలిచారు. వరుడు వినయ్ యమ్.సి.ఏ. చేశాడు. బెంగుళూరులో ఉద్యోగం. మంచి జీతం. అందగాడు. ఐశ్వర్యవంతుడు కూడా. తన రూపంతోనే కాక, వాగ్ధాటితోనూ అందరికీ ఆకర్షించాడు. వందన కూడా ఎందులోనూ తీసిపోలేదు. కాకపోతే ఈమె మితభాషి. అన్నిటికీ చిరునవ్వే సమాధానం. అమ్మాయీ, అబ్బాయీ కూడా ఒకరికొకరు నచ్చారని వాళ్ళ హావ భావాలను బట్టి అందరికీ అర్థమయింది. అంత మంచి సంబంధం కుదరడం వందనే కాదు, రామారావుగారు చాలా అదృష్టవంతులని అనుకున్నారు ఆయన తమ్ముళ్ళూ, మరదళ్ళూ. ఎంగేజ్‌మెంట్ డేట్ ఫిక్స్ చేసుకోబోతుండగా ఒక బాంబు పేల్చాడు వినయ్. నా దగ్గర హెచ్.ఐ.వి. నెగటివ్ సర్టిఫికెట్ ఉన్నది. వధువు దగ్గర కూడా ఉంటే, ఇక తనకెలాంటి అభ్యంతరమూ లేదని.."

ఆ మాట వినగానే రామారావుగారికి కోపం నషాళానికి అంటింది. ఆవేశంతో వణికి పోయారు. అగ్గిమీద గుగ్గిలమయ్యారు.

"ఫస్ట్ యూ గెటౌట్" అన్నారు గుమ్మం వైపు వేలు పెట్టి చూపిస్తూ.

"అంత తప్పుమాట తానేమన్నాడో" వినయ్‌కు అర్థం కాలేదు.

జరిగిన అవమానానికి, అతనికీ తట్టుకోలేనంత కోపం వచ్చింది. అయినా, దిగమింగుకుని, రామారావు గారికి వివరించి చెప్పాలని ప్రయత్నించాడు.

"మరొక్క మాట మాట్లాడినా మర్యాద దక్కదు. ముందు బయటికి పొండి" అంటూ గెంటినంత పని చేశారు ఆయన. జరిగిన తతంగానికి వందనతో సహా అందరూ మ్రాన్పడిపోయారు. కొద్దిసేపు ఎవరికీ ఏమీ అర్థం కాలేదు. మ్యారేజ్ బ్రోకర్‌తో సహా వరుని తరపు వారందరూ నిష్క్రమించారు. ఆయాసంతో వగర్చుతూ సోఫాలో కూలబడ్డారు రామారావు.

"ఇది మర్యాదస్తుల ఇల్లనుకున్నాడా..లేక సాని కొంప అనుకున్నాడా? ఆ వెధవ అంత మాట అడుగుతాడా? ఇంకొద్ది సేపు ఇక్కడే ఉంటే వాడి ప్రాణం తీసే వాణ్ణి" అంత కోపంగా ఆయన్ని ఎవరూ, ఎప్పుడూ చూడలేదు. ఆయనకి ఏమీ చెప్పలేక, అందరూ మౌనంగా ఉండిపోయారు.

ఆ చిరాకులో ఆయన కొన్నాళ్ళు వందనకు సంబంధాలు చూడటమే మానేశారు. తమ్ముళ్ళు పోరు పెట్టగా కొన్నాళ్ళకు మరొక సంబంధం చూశారు. ఇది అంతకంటే మంచి సంబంధం. వీళ్ళు అటువంటి ప్రశ్నలు వెయ్యలేదు. ఉభయుల అంగీకారంతో లగ్నాలు పెట్టుకున్నారు. ఎవరూ ఊహించని రీతిలో తన ఒక్కగానొక్క కూతురి పెళ్ళి అత్యంత వైభవంగా చేశారు రామారావు.

వందన అత్తవారింటికి వెళ్ళి, ముచ్చటగా కొన్నాళ్ళు కాపురం చేసింది. కూతురికి ఘనమైన సంబంధం చేశానని ఆయన మురిసిన్నాళ్ళు పట్టలేదు. ఆమెకు అనేక అనారోగ్యాలు మొదలయ్యాయి. విశ్రాంతి కోసం పుట్టింటికి వచ్చింది. ఆ వేళ హాస్పిటల్‌కు వెళ్తే, లేడీ డాక్టరు అన్ని పరీక్షలతోపాటు హెచ్.ఐ.వి. కూడా చేయించారు.

"పాజిటివ్.."

రిపోర్టు చూడగానే వందన కుప్పకూలిపోయింది.

రామ్మూర్తిగారు నిలువునా నీరైపోయారు. తను ప్రాణప్రదంగా పెంచుకున్న, తన ప్రియాతిప్రియమైన కుమార్తె భయంకరమైన ఎయిడ్స్ పీడితురాలు.

కనీ వినీ ఎరుగని, కలలో కూడా ఊహించని దుర్భర పరిస్థితి దాపురించింది ఆయనకు. సర్వాంగాలూ స్థంభించిపోయాయి. కట్టెలా బిగుసుకుపోయారు. కొద్దిసేపటికి తేరుకున్న ఆయన, వినయ్‌ని అవమానించి పంపిన తన అజ్ఞానం వికృతరూపంలో కళ్ళముందు నాట్యమాడినట్లుగా విరుచుకుపడిపోయారు.

-కోపూరి పుష్పాదేవి (విజయవాడ)

***

## నమ్మకం

రాధ గవర్నమెంటాఫీసులో ఉద్యోగం చేసి, రిటైరై రాధమ్మగా మారింది. పిల్లలు ముగ్గురూ ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. వాళ్ళకూ పెళ్ళిళ్లై పిల్లాపాపలతో హాయిగా తలో చోటా ఉన్నారు. రాధమ్మ భర్త కూడా బ్యాంకు ఆఫీసర్‌గా రిటైరయ్యాడు. చూడాలనిపిస్తే ఇద్దరూ వెళ్ళి పిల్లల్నీ, మనవల్నీ చూసొస్తారు. వాళ్ళూ శలవు దొరికినపుడల్లా వచ్చి వెడుతూంటారు.

రాధమ్మ ముక్కుసూటిగా పోయే వ్యక్తి. డబ్బులు బాగా వచ్చే సీటైనా ఎవరి దగ్గర నుండీ పైసా తీసుకోలేదు. సర్వీసులో ఉండగా నిజాయితీకి మారుపేరుగా ఉండేది. తనకు రావలసిన డబ్బుల్లో పైసా తేడా వచ్చినా ఊరుకునేది కాదు. దానధర్మాలు బాగానే చేస్తుంది. తన కిష్టమైతే ఎంతైనా ఖర్చుపెడుతుంది. నచ్చనప్పుడు పైసా ఖర్చు చెయ్యడంలో కూడా పదిసార్లు ఆలోచిస్తుంది.

రోజూ ఏ గుడికో, గానసభలకో, పురాణం వినడానికో వెళ్లడం ఆవిడకలవాటు. ఒక రోజు ధ్యానానికెళ్ళి వస్తూ దార్లో రెండు రూపాయల పువ్వులు కొంది. పది రూపాయల నోటిచ్చి, చిల్లర ఇమ్మంది. "అమ్మా నా దగ్గర ఏడు రూపాయిలే ఉంది చిల్లర" అంది పూల కొట్టమ్మాయి.

'మరిఎల్లా' అని సందిగ్ధంలో నిలబడ్డ రాధమ్మతో "అమ్మగారూ డబ్బులు రేపివ్వండి" అని పదినోటు తిరిగిచ్చేసింది.

'అయ్యో, నా మీద తనకున్న నమ్మకం, తన మీద నాకు లేకపోయిందే, ఒక్క రూపాయి తక్కువ ఉందని చెప్తే నేను తీసుకోలేదు. పూలమ్మాయి నన్నే రెండు రూపాయలు రేపిమ్మంది. తన మంచితనం ముందు నా పెద్దరికం చిన్నబోయింది" అనుకుని మొట్టమొదటి సారిగా తలదించుకుంది రాధమ్మ.

-సి.రత్నమాంబ (విజయవాడ)

***

## పరీక్ష

మూర్స్ ట్యుటోరియల్స్‌లో రాము మెట్రిక్యులేషను చదివి పరీక్షలో తప్పాడు. ప్రిన్సిపాల్ మధు దగ్గరకు వెళ్లి తనకు ఆ ట్యుటోరియల్స్‌లోని టీచర్లు వారి సబ్జక్టులను సరిగ్గా బోధించలేదని అందుచేత తను పరీక్షలో తప్పానని చెప్పాడు. తను చెల్లించిన ఫీజంతా తిరిగి ఇచ్చేయమని మధుని డిమాండ్ చేశాడు. తెలివైన